## క్లుప్తంగా

### ఆహ్వాన పత్రిక అందజేత

కాకినాడ సిటీ: ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే 21వ ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కౌన్సిల్ సమావేశపు ఆహ్వాన పత్రికను కలెక్టర్ కృతికా శుక్లాకు రాష్ట్ర ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహన్, పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ సోమవారం అందజేశారు. ఈ సమావేశాలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావడానికి స్పెషల్ కాజువల్ లీవ్ ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, కేవీఎన్ ప్రసాద్, సిటీ కార్యదర్శి ఎ.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల స్థలాల విభజనకు చర్యలు

కరప: స్థానిక సెంట్రల్ లే అవుట్‌లో కూరాడ గ్రామానికి ఇవ్వాల్సిన స్థలాలను విడదీసి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కూరాడ పీఏసీఎస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు రావులు ప్రసాద్ సోమవారం తహసీల్దార్‌ను కలసి తమ గ్రామ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి సెంట్రల్ లే అవుట్‌లో స్థలాలు చూపించాలని కోరారు. దీంతో తహసీల్దార్, రెవెన్యూ అధికారులు సెంట్రల్ లే అవుట్‌కు వెళ్లి స్థలాల విభజనకు వచ్చిన ముక్కురాళ్లను పరిశీలించారు. ఈ లే అవుట్‌లో కూరాడ గ్రామస్తులకు 320 వరకూ పట్టాలిచ్చామని, 160 వరకూ ప్లాట్లు విడదీశామని, మిగిలినవి కూడా విడదీసి, రెండు మూడు రోజుల్లో ఇస్తామని తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ ఇ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచర్రావు పాల్గొన్నారు.

### ఘనంగా హర్ దిల్ తిరంగా ర్యాలీ

కరప: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు జాతీయ జెండాలు చేబూని భారత్ మాతాకు జై అంటూ నినదిస్తూ సోమవారం కరపలో హర్ దిల్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు వార్డు సభ్యులు ఏకగ్రీవం

కరప: మండలంలోని గొడ్డటిపాలెం-6, నడకుదురు-7 వార్డుల ఉప ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగిసింది. ఆ వార్డులు ఏకగ్రీవమైనట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. గొడ్డటిపాలెంలో 6వ వార్డు సభ్యుడు చోడాబత్తుల సత్యనారాయణ మృతి చెందగా ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ నలుగురు నామినేషన్లు వేయగా, గ్రామంలోని నాయకులందరూ పార్టీలకతీతంగా సమావేశమై చర్చించుకుని, సత్యనారాయణ కుమారుడు మణికంఠకు ఏకగ్రీవం చేశారు. పోటీలో ఉన్న ముగ్గురూ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. విజేత మణికంఠకు స్టేజ్-1 ఆఫీసర్ డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు ధ్రువీకరణ పత్రం అందజేశారు. నడకుదురులో 7వ వార్డు సభ్యుడు పిల్లి లక్ష్మణుడు మృతి చెందడంతో వచ్చిన ఉప ఎన్నికలో ముగ్గురు నామినేషన్లు వేశారు. ఆ వీధి వారందరూ సమావేశమై చర్చించుకోవడంతో ఇద్దరు పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో గుల్లిపల్లి మాధవశ్రీను 7వ వార్డు సభ్యునిగా ఏకగ్రీవమయ్యారు. ఆయనకు స్టేజ్-1 ఆఫీసర్ వై.శివరామకృష్ణ ధ్రువీకరణ పత్రం అందజేశారు.

### మొక్కల పెంపకంతో మేలు

కాకినాడ రూరల్: మొక్కల పెంపకంతో మానవాళికే కాకుండా జీవరాశులన్నింటికీ మేలు జరుగుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి అన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద పీజీ సెంటర్‌లో అధ్యాపకులు, విద్యార్థులతో కలసి సోమవారం ఆమె మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా క్యాంపస్‌లో పెద్ద ఎత్తున మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి అధికారి డాక్టర్ ఎం.శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన దీర్ఘకాలిక రోగులకు సోమవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు పిల్లి నాగేశ్వరరావు, ప్రతినిధి కృష్ణమోహన్ మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా పక్షవాత రోగులకు ఇళ్ల వద్దనే సరకులు పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారికి రక్తదానం కూడా చేస్తున్నామని చెప్పారు.

### ప్రమాదాలు, దొంగతనాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

కరప: రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ఎస్.రామకృష్ణ సూచించారు. జి.భావారంలో సోమవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు పిల్లలు వాహనం నడపడం నేరమని, అలా చేస్తే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులేనని స్పష్టం చేశారు. ఊరికి వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసి, కిటికీలు, గోడలపై తాళం చెవులు ఉంచరాదన్నారు. బంగారు ఆభరణాలు లాకరులో ఉంచుకోవాలని, పక్కింటి వాళ్లకు లేదా పోలీసులకు సమాచారం చెప్పి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై జి.ప్రసన్నకుమార్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత స్మృతిపథం

- 1921లో కాకినాడ సందర్శించిన గాంధీజీ
- స్వాతంత్య్ర సమరోన్ముఖులు కావాలని ప్రజలకు పిలుపు
- నేటికీ పదిలంగా ఆయన అడుగుజాడలు



పైడా వెంకట నారాయణ ఇంటి మేడ పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న గాంధీజీ

కాకినాడ కల్చరల్: తన అహింసాయుత పోరాటంతో ప్రజలందరినీ ఒక్క తాటి పైకి తీసుకువచ్చి.. భరతమాత దాస్య శృంఖలాలను బద్దలుగొట్టి.. తెల్లవారి పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన గొప్ప నేత మహాత్మా గాంధీ. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆయన కాకినాడను సందర్శించి, ప్రజలను సమరోన్ముఖుల్ని చేశారు. ఆ జాతిపిత అడుగుజాడలు కాకినాడలో ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి. 1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీల్లో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశానికి గాంధీజీ హాజరయ్యారు. అనంతరం గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా భార్య కస్తూరీబాయితో కలసి 1921 ఏప్రిల్ 3న కాకినాడ సందర్శించారు. ఆయనను చూసేందుకు జనం పెద్ద ఎత్తున కాకినాడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పట్లో రైల్వే స్టేషన్ నుంచి గాంధీజీ బయటకు రావడానికి గంట సమయం పట్టింది. ఆయన వెంట కొండా వెంకటప్పయ్య, మహర్షి బులుసు సాంబమూర్తి, గంటి సుబ్బారాయుడు ఉన్నారు. వీరికి స్థానిక దేవాలయం వీధిలోని పైడా వెంకట నారాయణ ఇంట్లో ఆతిథ్యం ఇచ్చారు. ఎల్విన్‌పేటలోని పార్క్ వద్ద సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గాంధీజీ ప్రసంగించారు. ఆయన ప్రసంగాన్ని బులుసు సాంబమూర్తి తెలుగులోకి తర్జుమా చేశారు. అహింసే ఆయుధంగా స్వాతంత్ర్య సమరాంగణంలోకి ప్రతి ఒక్కరూ ఉవ్వెత్తున ఉరకాలని గాంధీజీ ఇచ్చిన పిలుపునకు పలువురు స్పందించారు.



పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్న గాంధీ భవన్



గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన జాతిపిత విగ్రహం

**గాంధీ బొమ్మ సెంటర్**

మరో ప్రత్యేకత ఏమిటంటే గాంధీజీ జీవించి ఉండగానే స్వాతంత్ర్యానికి ముందే 1945లో ఆయన విగ్రహాన్ని కాకినాడలో నెలకొల్పి రాజగోపాలాచారితో ఆవిష్కరించారు. నేటికీ ఆ కూడలిని గాంధీ బొమ్మ సెంటర్‌గా పిలుస్తారు. అలాగే గాంధీజీ పర్యటించిన ప్రాంతాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేసి, గాంధీ భవన్‌గా నామకరణం చేశారు. గాంధీ భవన్ నిర్మాణంలో దివంగత మెర్ల సబ్బారావు, తనికెళ్ళ సత్యనారాయణమూర్తి, కొమండూరి శఠకోపాచార్యులు కీలక పాత్ర పోషించారు. ఇక్కడ గాంధీజీ జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటోలను ప్రదర్శనకు ఉంచారు. అలాగే గాంధీజీ రచించిన అరుదైన పుస్తకాలు సేకరించి, గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. గాంధీ భవన్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం గాంధీ భవన్ అధ్యక్షులుగా వీఎల్ గాంధీ, ఉపాధ్యక్షులుగా జి.విశ్వేశ్వరావు, కార్యదర్శిగా వక్కలంక రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా వైఎస్‌వీఎస్ మూర్తి వ్యవహరిస్తున్నారు. గాంధీజీ ఆశయాల సాధనకు ఈ కమిటీ నిరంతరం కృషి చేస్తోంది. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



పూసలతో కుట్టిన గాంధీ చిత్రాన్ని చూపుతున్న మణికంఠ

## పూసకుట్టుతో గాంధీ చిత్రం

కరప: మండలంలోని కూరాడ జెడ్పీ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని నర్ల మోహన మణికంఠ ఒక క్లాత్‌పై గాంధీజీ చిత్రాన్ని పూసకుట్టు కుట్టి దేశభక్తి చాటుకుంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్వాంతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ చిత్రాన్ని పూసలతో కుట్టానని మణికంఠ తెలిపింది. ఆమెను, ఆమెకు పూసకుట్టు నేర్పిన క్రాఫ్ట్ టీచర్ సీహెచ్ తులసి లక్ష్మిని హెచ్‌ఎం పి.అరుణకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

## రెపరెపలాడిన త్రివర్ణ పతాక



300 అడుగుల జాతీయ జెండాతో సాగుతున్న విద్యార్థుల ర్యాలీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామారావుపేటలోని నారాయణ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థులు 300 మంది సోమవారం 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. రామారావుపేట నుంచి జెడ్పీ సెంటర్ మీదుగా తిరిగి రామారావుపేట వరకూ ఈ ర్యాలీ సాగింది. వందేమాతరం, మాతరం మాతరం వందేమాతరం అంటూ దేశభక్తి నింపే నినాదాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీని ప్రిన్సిపాల్ షర్మిల ప్రారంభించారు.

### పబ్లిక్ సౌండ్ సిస్టమ్ వితరణ

కరప: గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ హైస్కూలులో చదివి, వైద్య వృత్తిలో స్థిరపడిన డాక్టర్ కర్నాసుల విష్ణుమూర్తి ఆ పాఠశాలకు రూ.45 వేల విలువైన పబ్లిక్ సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. దీనిని సోమవారం ప్రారంభించారు. ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ, జనసేన యాత్రలు.. ఒట్టి పాత్రలు



నాగమణి

కాకినాడ రూరల్ టీడీపీ, జనసేన చేస్తున్న యాత్రలన్నీ వట్టి పాత్రలుగానే మిగులుతున్నాయని ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ జమ్ములమడక నాగమణి అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్లు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ ఎన్ని యాత్రలు చేసినా ప్రజల నుంచి స్పందన రావడం లేదన్నారు. పుంగనూరులో తనను చంపాలనుకుంటున్నారంటూ చంద్రబాబు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ సభ ప్రదేశం మార్చి, నా రూటే సెపరేటు అంటూ కుట్ర చేసి, పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయించారన్నారు. పుంగనూరు ఘటన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హత్యాయత్నం ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖలో చెత్త పన్ను గురించి మాట్లాడటంపై నాగమణి అభ్యంతరం వ్యక్తం చేశారు. చెత్త సినిమాలు తీసి రూ.150 టికెట్‌ను రూ.360కి పెంచమని ప్రభుత్వాన్ని వేడుకోవడం డబుల్ ఇంజన్ ట్యాక్స్ వసూలు చేయడం కాదా అని ప్రశ్నించారు. ఏపీ ఎంపీలను చులకనగా చూస్తున్నారని పవన్ కల్యాణ్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీల కృషి వల్లనే గత నాలుగైదు నెలల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి బకాయిలు రాబట్టుకోగలిగామని నాగమణి చెప్పారు.

### సత్రాల కమిటీలకు నోటిఫికేషన్

బోట్‌క్లబ్: నగరంలోని పలు సత్రాలకు నూతన కమిటీల నియామకానికి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. స్థానిక మార్కెట్ వీధిలోని బంగారు చిన శోభనాద్రి సత్రం, దేవాలయం వీధిలోని పైడా చలమయ్య సత్రం, సినిమా రోడ్డులోని కోకనాడ అన్నదాన సమాజం, సినిమా రోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం, జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్‌లకు నూతన కమిటీలు నియమించనున్నారు. ఆయా కమిటీల నియామకానికి 20 రోజుల్లోగా అన్ని చర్యలూ తీసుకోవాలని సంబంధిత ఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. సభ్యులు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి, నూతన కమిటీలు నియమించాలని సూచించారు.

# అమరవీరుల త్యాగం.. స్వాతంత్ర్య ఫలం

- ఘనంగా 'నా భూమి – నా దేశం'
- అమరుల కుటుంబాలకు ఘన సత్కారం



అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్సీ పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళా దీప్తి, శివప్రసన్న, కమిషనర్ తదితరులు

కాకినాడ: అమరవీరుల త్యాగాల వల్లే స్వాతంత్ర్య ఫలాలు అనుభవించగలుగుతున్నామని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో నా భూమి – నా దేశం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పద్మశ్రీతో పాటు కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. తొలుత పార్కులోని భరతమాత, స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన అమరవీరుల కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కార్గిల్‌తో పాటు భారత సరిహద్దుల్లో, మావోయిస్టుల చేతుల్లో హతులైన అమరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. పార్కులో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అమరవీరుల పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జ్యోతులు వెలిగించి నా భూమి – నా దేశం కోసం కృషి చేస్తానంటూ ప్రతిజ్ఞ చేశారు. సేకరించిన మట్టిని కలశంలో నింపి, ఢిల్లీ పంపేందుకు సిద్ధం చేశారు. అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మృతి చెందిన సైనికుడు కె.భాస్కరరావు భార్య రత్నకుమారి, ఇతర సత్కార గ్రహీతలు చేసిన ఉద్వేగభరిత ప్రసంగం అందరినీ కంటతడి పెట్టించింది. తమ కుటుంబ సభ్యులు మృతి చెందినప్పటికీ దేశం కోసం మరణించారన్న సంతృప్తి ఉందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను సైన్యంలో చేర్పించేందుకు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న మాట్లాడుతూ, యుద్ధవీరుల త్యాగాలు నేటితరానికి ఆదర్శప్రాయమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ, సిపాయిల తిరుగుబాటు నుంచి క్విట్ ఇండియా ఉద్యమం వరకూ దేశం కోసం ఎంతో మంది ప్రాణాలు అర్పించారని, వారి సేవలను స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సత్యప్రసాద్, ఎస్ఈ సత్యకుమారి, కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, డీఈ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన పాఠశాలలు



హైస్కూలులో ఎన్‌సీసీ విద్యార్థుల మార్చ్‌పాస్ట్ ట్రయల్ రన్

కరప: స్వాతంత్ర్య దినోత్సవానికి మండలంలోని పాఠశాలలు ముస్తాబయ్యాయి. మంగళవారం జరిగే ఈ వేడుకలకు ఆయా పాఠశాలలను విద్యార్థులు అందంగా తీర్చిదిద్దారు. జెండాలు అతికించి, మేకులు కొడుతూండటంతో తరగతి గదులు పాడవుతున్నాయని ఉపాధ్యాయులు చెప్పడంతో.. ఈ ఏడాది హైస్కూలు విద్యార్థులు పాఠశాల ఆవరణలో జెండాలు కట్టారు. జెండా వందనం చేసేచోట, రంగులు వేసి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నాడు – నేడు పనులు జరగాల్సిన పాఠశాలల్లో తమ తరగతి గదుల గోడలకు సోమవారం రంగులు వేసుకున్నారు. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు తెలగాని వెంకట్రావు ఆధ్వర్యాన ఎన్‌సీసీ విద్యార్థులు పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా మార్చ్‌పాస్ట్ ట్రయల్ రన్ నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, పంచాయతీ, సహకార సంఘాల కార్యాలయాలను, పీహెచ్‌సీలను స్వాతంత్ర్య వేడుకలకు అధికారులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

**జన్మభూమి పార్కులో నేడు నృత్య ప్రదర్శన**

కాకినాడ కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీనగర్‌లోని జన్మభూమి పార్కులో శ్రీ సూర్య నృత్య నికేతన్ ఆధ్వర్యాన సుమారు 200 మంది విద్యార్థినులతో మంగళవారం సాయంత్రం భారీ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. నికేతన్ నాట్యాచారిణి ఎం.మహాలక్ష్మి ఈ విషయం తెలిపారు. దేశభక్తి గీతాలకు అనుగుణంగా విద్యార్థినులు నృత్యరూపకం ప్రదర్శిస్తారన్నారు. అలాగే 150 మంది మహిళలతో కోలాటం, సీనియర్ బాలికలతో కర్రసాము ప్రదర్శన కూడా ఉంటాయని వివరించారు.

# జీజీహెచ్‌లో డీఎంఈ ఆకస్మిక తనిఖీలు



జీజీహెచ్‌లో పర్యటిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం జీజీహెచ్‌లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓపీ సరళితో పాటు ఇన్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ల్యాబ్‌లు, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్, రేడియాలజీ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగుల సౌకర్యార్థం ఈ నెలాఖరు నుంచి ఓపీలు కొనసాగుతున్న వివిధ విభాగాల భవంతుల్లోనే వైద్య, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను నియమించి శాంపిల్ కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని ఆదేశించారు. వివిధ విభాగాధిపతులు, వైద్య బృందాలు, అధికారులతో జీజీహెచ్ కమ్యూనిటీ హాలులో సమావేశమై ఈ-ఆఫీసింగ్, ఈ-ఫైలింగ్, ఈ-ల్యాబ్‌ల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. ఆరోగ్యశ్రీ కేసులు పెరిగేలా చర్యలు తీసుకొని, జీజీహెచ్‌కు సమకూరే ఆరోగ్యశ్రీ నిధుల వృద్ధికి కృషి చేయాలని హెచ్‌ఓడీలకు సూచించారు. ఆరోగ్యశ్రీ నమోదులో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని సిబ్బందికి చెప్పారు. ఇన్ పేషెంట్ల నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై డీఎంఈకి రోగులు ఫిర్యాదు చేశారు. ఆధార్ కార్డుతో అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తేనే అడ్మిషన్ ఇస్తున్నారని చెప్పారు. పలుమార్లు ఓటీపీ రాకపోవడం అడ్మిషన్‌కు ప్రతిబంధకంగా మారుతోందని వివరించారు. దీనిపై స్పందించిన డీఎంఈ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర శాఖకు తక్షణమే లేఖ రాసి, పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎంఈ వెంట రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఆర్‌ఎంఓలు డాక్టర్ రాహుల్, డాక్టర్ యమున, ఏపీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# సచివాలయాల్లోనూ స్పందన



కాకినాడ: స్థానిక సమస్యల పరిష్కారానికి సచివాలయాల్లో కూడా అర్జీలు అందజేయవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇళ్ల పట్టాలు, ఆక్రమణలు, హౌసింగ్ తదితర అంశాలపై పది మంది అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆర్థిక అంశాలు మినహా మిగిలిన ప్రతి సమస్యనూ సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ నగర పాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. టౌన్ ప్లానింగ్, వీధి దీపాలు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఏడుగురు ఫోన్ ద్వారా సమస్యలు వివరించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నాగనరసింహారావు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### చలో విజయవాడ విజయవంతం చేయాలి

కరప: ఆంధ్రప్రదేశ్ ఎన్జీఓ సంఘం ఈ నెల 21, 22 తేదీల్లో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బీఆర్‌పీ చౌదరి కోరారు. సంఘం ప్రతినిధులతో కలసి మండలంలోని ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి, ఉద్యోగులను ఆయన సోమవారం కలిశారు. విజయవాడలో జరిగే 21వ స్టేట్ కౌన్సిల్ మీటింగ్‌కు తరలిరావాలని కోరారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీఓ హోమ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర మంత్రులు, అధికారులు హాజరవుతున్నారని చౌదరి తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ కార్యదర్శి కె.వెంకటరత్నం, ఉపాధ్యక్షులు సుజాత, ఎస్‌కే నాగేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శి కె.కేశవరావు, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.